# దుగినవెల్లిలో ప్రగతి పరుగులు

నాడు వలసలు.. నేడు అభివృద్ధి

పల్లెప్రగతితో మారిన రూపురేఖలు

అభివృద్ధిలో దూసుకుపోతున్న ఒకనాటి వలస గ్రామం



గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

కట్టంగూర్, అక్టోబర్ 17 : ఒకప్పుడు ఆ గ్రామంలో కరువు విళయతాండవం చేసేది. పనులు లేక గ్రామంలోని ఎన్నో కుటుంబాలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. వ్యవసాయ, కూలీ పనులు లేకపోవడంతో అధిక శాతం మంది గ్రామస్తులు తమ ఇడ్లకు తాళాలు వేసి ఇంటిల్లుపాది కల్లు గీసేందుకు, పాల వ్యాపారం చేసేందుకు సూరత్, ఆంధ్ర, ముంబాయి ప్రాంతాలకు బతుకుదెరువు కోసం ఆరు నెలల పాటు వలసలు వేళ్లేవారు. దానిక తోడు వానకాలం వచ్చింటే గ్రామంలో వ్యాధులు విజృంభించేవి. డెంగీ, మలేరియా కేసులు అధికంగా నమోదయ్యేవి. అందుకు ప్రధాన కారణం గ్రామంలో మురుగు కాల్వలు, సీసీ రోడ్డు లేకపోవడంతో పారిశుధ్యం లోపంతో గ్రామస్తులు రోగాల బారిన పడినా నాటి పాలకులు ఎవరూ పట్టించుకోలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి పనులతో వలసలు, వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ చేసి రైతులకు రైతుబంధు ఇవ్వడంతో వాటితో ఉన్న భూములను సేద్యం చేసుకుంటు వలసలు వెళ్లడం మానేశారు. ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులతో ఆ గ్రామ రూపురేఖలు మారిపోయాయి.




గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న దుగినవెల్లి గ్రామంలో 2,700 జనాభా, 1,700 ఓటర్లు ఉండగా 400 కుటుంబాలు గ్రామంలో నివాసం ఉంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి పనులతో గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నది. సుమారు రూ.2కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్‌తో వారానికి రెండ్రోజులు ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్థంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి లూజ్ లైన్లను సరి చేశారు. పల్లె ప్రకృతి వనంలో రూ. 3 వేలు, హరితహారంలో భాగంగా రోడ్లు, ప్రతి వీధికి ఇరువైపులా సుమారు 4 వేల మొక్కలు నాటారు. ప్రతి ఇంటికీ 6 రకాల పూల, పండ్ల మొక్కలు, చెత్తబుట్టను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించుకొని గ్రామాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచారు.

### గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు

- గ్రామంలో ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం 90 శాతం వందశాతం పూర్తయ్యాయి. రూ.1.50కోట్లతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు
- రూ.12.60 లక్షలతో వైకుంఠధామ నిర్మాణం
- రూ.2.40 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు
- రూ.15లక్షలతో తూర్పాయిగూడెంలో పెద్దవాగుపై కల్వర్టు నిర్మాణం
- గ్రామంలో సుమారు రూ.30లక్షలతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు చేపట్టారు.

### ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి



ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవ, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషి సహకారంతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుంటున్నాం. పల్లెప్రగతితో గ్రామంలో చాలా సమస్యలు పరిష్కరించుకున్నాం. ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను గుర్తించి అన్ని పనులను చేపట్టాం. ఎమ్మెల్యే సకాలంలో గ్రామానికి కావలిసిన పనులకు వెంటనే మంజూరు చేస్తున్నారు.

– వనం సైదమ్మాదుర్గయ్య, సర్పంచ్

### సీసీ రోడ్లతో ఇబ్బందులు దూరం



సమైక్య పాలనలో గ్రామం ఏ మాత్రం అభివృద్ధి జరగలేదు. గత పాలకులు ప్రజల సమస్యలు పట్టించుకోలేదు. గతంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక నీరంతా ఇండ్ల ముందుచేరి వీధులన్నీ బురదమయమై అడుగుపెట్టాంటే గ్రామస్తులు నానా అవస్థలు పడేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించారు. ప్రభుత్వం పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనులతో మరింతా అభివృద్ధి చెందుతుండడంతో మా ఊరు ఇప్పుడు మంచిగయింది.

–నిమ్మనగోటి రమేశ్,గ్రామస్తుడు

## ముద్రణ వ్యాపారులు ఎన్నికల నిబంధనలు పాటించాలి

చౌటుప్పల్‌రూరల్, అక్టోబర్ 17 : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ముద్రణ వ్యాపారులు నిబంధనలు పాటించాలని మండల ఎలక్టోరల్ అధికారి హరికృష్ణ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముద్రణా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రించే వారు వాల్ పోస్టర్లు, కర పత్రాలు, ఫ్లెక్సీలు ప్రచారం ఇచ్చేవారి వివరాలు,ప్రచార సామాగ్రి ఖరీదు చేసేవారి వివరాలు సైతం రికార్డుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. కరపత్రం, పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రణా దుకాణం పేరు, తేదీ, బిల్లు, క్రమసంఖ్య, ఎన్ని కాపీలు ముద్రించినది తదితర వివరాలను ఎప్పటికప్పుడు మండల ఎలక్టోరల్ అధికారికి అందజేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కుమ్మర సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లింగస్వామి

మర్రిగూడ,అక్టోబర్ 17 : కుమ్మరుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన ఏరుకొండ లింగస్వామి ఎన్నికయ్యారు. జనగామ జిల్లాలో మంగళవారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకారపు మోహన్ ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా లింగస్వామి విలేకరులతో మాట్లాడుతూ కుమ్మరుల సమస్యలను పరిష్కరిస్తూ ఐక్యమత్యానికి కృషి చేస్తానన్నారు.

## 19న మునుగోడు మండల సమావేశం

మునుగోడు, అక్టోబర్17 : ఈ నెల 19న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సకాలంలో హాజరు కావాలని,అన్నిశాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

## బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 17 : మతోన్మాద బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం స్థానిక విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం సూర్యాపేట జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక మతోన్మాద చర్యలకు పాల్పడుతూ మేధావులను, జర్నలిస్టుల హక్కులను హరిస్తున్నట్లు చెప్పారు. లాభాల్లో ఉన్న ఎల్ఐసీ, రైల్వే, పోస్టల్, విమానయానం, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అంబానీ అదానీలకు కట్టబెడుతున్నాడని విమర్శించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సమాన్యులపై భారం మోపుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యూకేషన్ కమిటీ నాయకుడు బండారు రమేశ్, సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నాంపల్లి : కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

నాంపల్లి, అక్టోబర్ 17 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం గ్రామస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల దిమ్మ తిరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే నేడు పల్లెల్లో కనిపిస్తున్నాయన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ మరింత అభివృద్ధికి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్ రెడ్డి , బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి కోరే యాదయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు సతావత్ సర్దార్ నాయక్, మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కడారి శ్రీశైలం యాదవ్, నడింపల్లి యాదయ్య, సర్పంచులు నాగులవంచ శ్రీలత, అందుగుల యాదయ్య, కుందారపు రమేశ్, కారింగ్ నర్సింహ, రాపోతు దేవేంద్ర, రమాబాత్ శంకర్ నాయక్, సైదులు, రమావత్ రవి నాయక్, గుండాల అంజయ్య, దండిగా నర్సింహ పాల్గొన్నారు

### రేపు మర్రిగూడకు ఎమ్మెల్యే కూసుకుంట్ల

మర్రిగూడ : ఈ 19న మర్రిగూడకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి రానున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ తెలిపారు.మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.మండలకేంద్రంలోని విజయా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సర్పంచ్ నల్ల యాదయ్య, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మారగోని వెంకటయ్య యాదవ్, నాయకులు చెర్కు శ్రీరాములు గౌడ్, పందుల కృష్ణ గౌడ్, మహ్మద్ అబ్దుల్ రజాక్, సింగారపు భాస్కర్ ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మోట కొండూర్ : నాంచారిపేటలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోటకొండూర్, అక్టోబర్ 17 : మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబందిత అధికారులను ఆదేశించారు. ఓటు హక్కు లేని వారు ఈ నెల 30వ వరకు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. మంగళవారం మండలంలోని నాంచారిపేట గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అర్హులని ప్రతి ఒక్కరు ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శాంతిలాల్ ఎంపీడీఓ వీరస్వామి, సర్పంచ్ పైళ్ల వినోద, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలి : డీఏఓ అనురాధ



యాదగిరిగుట్ట: వంగపల్లిలో మాట్లాడుతున్న డీఏఓ అనురాధ

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17 : పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను రైతులు ఎంచుకోని, ఆర్థికంగా ఎదగాలని రైతులకు డీఏఓ అనురాధ సూచించారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమగ్ర పంటల యాజమాన్యం చేపట్టడం ద్వారా రైతులు పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం చేకూరే అవకాశం ఉందన్నారు. ఆరుతడి పంటల వల్ల భూసారం పెరిగి చీడపీడలు అదుపులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి అన్నపూర్ణ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మధుశేఖర్, మమత, సుమాలిని, అరుణ శ్రీ, వ్యవసాయ సంచాలకులు పద్మావతి పాల్గొన్నారు.